# మేలి బంగారుపురం

ఆకలితో, అనారోగ్యంతో అలమటించే ప్రజల బాగోగుల్ని పట్టించుకోక రాజ్యాన్ని సుభిక్షం చేస్తామనే పాలకుల మాటలు కోటలు దాటినా ఆచరణ గడప దాటదు. అప్పుచేసి పప్పు కూడు చందాన అభివృద్ధిని సాధించవచ్చని సలహాలిచ్చే బడా సంస్థలు అంతిమంగా తమ వేలితో తమ కంటిని పొడుచుకొనే పరిస్థితి కల్పిస్తాయి. ఈ వాస్తవాల్ని సున్నితంగా, కథా శిల్పానికి భంగం కలిగించకుండా ఆవిష్కరించడం రచయిత ప్రతిభకు తార్కాణం. ఒక్కమాటలో చెప్పాలంటే మన ప్రభువుల వర్తమాన ఆర్థిక, రాజకీయ విధానాలపై వ్యంగ్యాస్త్రం ఈ కథ.





సువర్ణముఖి

అనగనగా ఒక తామర రాజ్యంలో మేళాపురం అనే సామంత రాజ్యానికి, బొల్లిరాజనే రాజు పరిపాలిస్తుండేవాడు.

ఆయనకు మంచివాడనీ, పరిపాలనాదక్షుడనీ, ఆధునిక పరిజ్ఞానం కలవాడనీ పేరుండేది.

ప్రజలు ఆహారం లేక అనారోగ్యంతో బాధపడేవారు రాజ్యంలో దారిద్ర్యం విలయ తాండవం చేస్తుండేది.

రాజ్య ఆర్థిక సంక్షోభమే- ఈ కరువు కాటకాలకు కారణమని 'మేళా' కొడుతూ బొల్లిరాజు చెప్తుండేవారు.

ఆ రాజ్యంలో ఒకానొక ముసలి ఆడపిల్లి బ్రతుకుతుండేది. కడవరి కాన్పుగా ముసలి పిల్లికి నవ మాసాలు నిండినవి. ప్రసవ సమయం ఆసన్నమైనది.

రాజ్యంలో పాల కరువు తీవ్రంగా ఉండేది. యాదవుల వీధుల్లో సైతం పాలులేక నిండుగర్భిణీ అయిన ముసలిపిల్లి విలవిలలాడుతూ- మేళాపుర రాజధానికి చేరుకుంది. రాత్రింబవళ్ల వెతికివెతికి రాజకోట చేరుకుంది. సైనికులు నలభై ఏడో రకం బల్లేలు పట్టుకొని పహరా కాయడం పిల్లికంట పడింది.

వారికంట పడకుండా తప్పించుకొనుటకు మార్గాలను అన్వేషించి, గుర్రాల సావిడిలో అడుగుపెట్టి బస కుదుర్చుకుంది.

మంత్రివర్యులు, అధికారుల ఇళ్లు ఆరాతీసి, ఆహారాన్ని అన్వేషించి రోజులు ఈడ్చుకొస్తుండేది.

ఒకరోజు పిల్లి ప్రసవించి ఏడుగురు పండంటి బిడ్డలకు చివరగా తల్లి అయి కష్టబడి పోషిస్తూ కాలం గడిపేది. అంతఃపురంలో ప్రవేశించాలనే పిల్లి కోరిక రోజురోజుకూ తీవ్రమయ్యేది. ఏడుగురు పిల్లలను ఏడు మాంచి ఇళ్లల్లో దింపి, బరువు దింపుకొని, ఎట్టకేలకు ఒకానొక అర్ధరాత్రి అంతఃపురంలో ప్రవేశించింది ముసలిపిల్లి.

ఒకచోట అనేకమంది ముందు ట్రంకు పెట్టెలు లాంటివి పెట్టుకొని ఏవేవో చూస్తూ హడావిడిగా ఏవేవో లెక్కలు వేస్తున్నారు. మరోచోట ఏకాంతంగా, ప్రశాంతంగా బొల్లిరాజుగారు ట్రంకుపెట్టె సైజు ఉన్న పెట్టెలోంచి ఏవేవో చిత్రాలు, ఏవేవో లెక్కలు చూస్తున్నారు. అదిచూచిన ముసలిపిల్లికి ఆశ్చర్యం కలిగింది. ఆనందం కలిగింది. ఆ రెండూ పాలూ- నీళ్లూ కలగలిసి, ధైర్యం కలిగించుకొని-

"రాజుగారిని ప్రణామములు!" అని వెనక కాళ్లపై నిలబడి, ముందు కాళ్లు జోడించింది.

ప్రతి నమస్కారంగా రాజుగారు గంగిరెద్దులా తలూపి-

"ఏం?" అన్నారు.

"మహాప్రభూ! బహుచిత్రంగా ఉన్నది! దీనిని ఏమందురు?"

"ఇదా! కంప్యూటర్"

"మహాప్రభువులు మన్నించాలి! దీనివలన మానవునికి ఏం ఉపయోగమున్నది" "ఒహో పిల్లీ... పిచ్చా... లేక పిచ్చిపిల్లివా? ఈ రోజుల్లో అన్న వస్త్రాలు లేకున్నను మానవుడు బ్రతవచ్చును. కాని కంప్యూటర్ లేకున్నా మానవ మనుగడయే లేదు" అని పిచ్చిగా నవ్వి, చెంబులో పాలు గ్లాసులో పోసుకొని త్రాగారు.

"చిత్తం... అటులనా... అందులో ఏమి చూస్తున్నారు"

"రూపాయి రాక- రూపాయి పోక" అంటూ గడ్డాంగోకారు బొల్లిరాజుగారు

"మహాప్రభూ! నేను లోక సంచారం చేసి వస్తున్నాను. రాజ్యం కరువు కాటకాలలో ఉన్నది. జనం బాధలు పడుతున్నారు"

"అవును అందుకోసమే- ఆధునిక విజ్ఞానాన్ని రాజ్యమంతా విస్తరిస్తున్నాను. మధుపానీయం విచ్చలవిడిగా సేవించవచ్చునని హుకుం జారీ చేసితిమి.

రోజంతా నేను నిద్రలేకుండా లెక్కలు వేస్తున్నాను. అయినను రాజ్య ఆర్థిక పరిస్థితి బాగుగా లేదు" మాటల్లో బాధపడ్డారు రాజుగారు.

ముసలిపిల్లి నొసలు చిట్లించి, ఆలోచించి ఇలా-

"ప్రభువులవారికి నేను చెప్పేటంతటి దానిని కాను, తమరు మన్నిస్తే మా పిల్లుల ధర్మాన్ని నేను చెప్పగలను"

దోసకాయ చెంబులో పాలు గ్లాసులో పోసుకొని త్రాగుతూ-

"సరే చెప్పు" ముక్తసరిగా అన్నారు రాజుగారు.

"రాజ్య ఆర్థిక పరిస్థితి, ఇంటి ఆర్థిక పరిస్థితి ఏదైనా సరిగా ఉండాలంటే ముందు మనం, మన కార్యకర్తలు, సరిగా ఉండాలి. మా పిల్లి జాతి ఏదైనా ఇంటిలో దూరి ఎలుకను పట్టినచో- దానిని పూర్తిగా తినాలనే నిబంధన ఉంది- ఎందుకంటే సగం తింటే ఆ ఇంటి యజమాని, మా పిల్లి జాతి మొత్తాన్ని కలిపి 'వెధవ చచ్చిన పిల్లులం'టాడు. అదేకాక రెండోసారి పిల్లి ప్రవేశాన్ని అంగీకరించడు. మీ కార్యకర్తలు, ఏదైనా తిన్నా చేసినా పూర్తిగా తినమని సలహా ఇవ్వగలరు.

దాని వలన ముందు మనం నిలదొక్కుకుంటాం. రహస్య ఒప్పందం పథకం ఒకటుంది. ఎలుకల్లో పెద్దవాటిని పంది కొక్కులంటారు- ఏ కాలువ పక్కనైనా ఓ క్షణకాలం మాటుకాస్తే- దొరికిపోతాయి. వాటిలో- కొన్నింటినీ చంపుతాం కొన్నింటిని వదిలిపెడతాం. దానివలన చిన్న ఎలుకలను మాకు బహుమతిగా ఇస్తాయి. చిన్న ఎలుకల చోట్లు చూపించుతాయి. మహారాజా! అన్నిరోజులూ మనవి కావు. రోజులన్నీ ఒకలా ఉండవు. అందుచేత ఈ పందికొక్కుల మూలంగా కొన్నిరోజుల బెడద తీరుతుంది. అంతేగాక పెద్దపెద్ద ఇల్లల్లోకి ప్రవేశించే రహస్య మార్గాలను చూపుతాయి"చెప్పి ఆవుళ్లు తీసింది ముసలిపిల్లి.

"బాగుంది! బాగుంది. మీ పిల్లిజాతి చాలా తెలివైందేనన్న సంగతి ఇంతవరకు తెలియనందుకు విచారం వ్యక్తం చేస్తున్నాను. ఇకనుంచి- పిల్లులు, నల్లులు, బల్లులు, ఉడతల సలహా కూడా తీసుకుంటానని నీ ముందు హామీ ఇస్తున్నాను. కాని ఈ పరిపాలనా యంత్రాంగాన్ని నౌకరులతో జీతాలిచ్చి నడపడం చాలా కష్టంగా వుంది. జీతాలు- బత్యాల కోసం రూపాయి రూపాయీ కూడేసి, ఈ కంప్యూటర్‌లో రోజులు తరబడి లెక్కలేసి ఇవ్వవలసి వస్తోంది" అన్నారు బొల్లిరాజుగారు.

ఆ మాటకి ముసలిపిల్లి పకపకా వికవికా వికపకా పకవికా నవ్వినవ్వి పకాల్‌మని నవ్వి ఆపి-

"రాజా! ఇది మా పిల్లిజాతిలో ప్రాథమిక విషయం. ఇదో సమస్యా? కానేకాదు. రాజా! నాకు ఈ చివరి కాన్పులో ఏడుగురు సంతానం అయినా నేను భయపడలేదు. నేనేకాదు మా జాతిలో ఏ పిల్లీ భయపడదు- ఎందుకంటే పిల్లలకి కళ్లు తేరగానే- ఒక్కో పిల్లని ఒకొక్కక్క వీధిలో పెద్దపెద్ద ఇల్లల్లో వదిలిపెడతాం. కళ్లు తేరని బలహీన పిల్లలని తొక్కి చంపేస్తాం. ఎందుకంటే మేం చంపకపోయినా మా శతృజాతి అయిన కుక్కలు- ఆ పిల్ల పిల్లిని బ్రతకనియ్యవు. రాజ్య పరిపాలనాంగములకు దీనిని పోల్చుకొనవచ్చును. నా మాటలు మీకు అర్థమయ్యాయనే భావిస్తున్నాను."

"శహాభాష్! నీ మేథోశక్తికి ధన్యవాదములు" అంటూ చేతులు జోడించి- "మంత్రి వర్యులారా! రండి!... రాజ్యానికి ధనరాసులు గలిగే మాటలు పిల్లి చెప్పింది. మనిషిగా పుట్టినందుకు నేను బాధపడుతున్నాను" అని ముసలి పిల్లి చెప్పిన ధర్మాన్ని... పిల్లి ధర్మాన్ని అందరికీ వివరించారు రాజుగారు. 'రాజ్య ప్రగతి రథసేన', రాజ్య కాగడాకాంతిసేన, రాజ్య వైద్యసేన మొదలగు కొన్ని సేనలకు ఆ రాజ్యంలో ఉండే ముగ్గురు పెద్ద వజ్రాల వ్యాపారులకు వప్పజెప్పితే కొంత మొత్తం ఆదాయం వస్తుందని, అధికారులు కంప్యూటర్‌లో లెక్కలేసి నిముషాల్లో తేల్చి చెప్పారు.

రాజధానిలోనే కళ్లు తెరవని పిల్లలా ఉన్న ఓ విభాగాన్ని (సేనను) చంపేద్దామన్నారు విత్త మంత్రివర్యులు.

"బాగుంది! ఇప్పుడు లెక్కలేయండి?" అన్నారు రాజుగారు.

అధికారులు లెక్కలు గట్టి-

"రాజ్య పరిస్థితి కుదుట పడుతుంది. రాజ్యంలో ధాన్యాగారాలు ధనాగారాలు కట్టించవలసి రావొచ్చు. మరికొన్ని సేనలను వ్యాపారులకు అప్పజెప్పితే రాజ్యమంతా వజ్రాలు వడ్డించవచ్చును" అన్నారు రాజ్య ముఖ్యసలహాదారు.

"అటులనా... అయితే... ఈ 'మేళాపురం' రాజ్యాన్ని రేపటి నుంచి 'మేలిబంగారుపురం'గా మార్చినట్లు చాటింపు వేయించండి" ఆజ్ఞాపించారు రాజుగారు. ఇంతటి విజయానికి కారణమైన పిల్లిని, కౌగలించుకున్నారు రాజుగారు. తనంతటి తెలివితేటలు మనుషులకు లేనందుకు ఆనందంతో ఉప్పొంగిపోయింది ముసలి పిల్లి.

రాజుగారు ఆనందాన్ని తట్టుకోలేక తాత్కాలిక పురస్కారంగా దోసకాయ చెంబులోని పాలను పిల్లి ముందుకునెట్టి-

"మై డియర్ కేట్!- మా రాజ్య ఆరాజ్య దేవతా! త్రాగండి... మా రాజ్య విత్త సలహాదారుమీరే!" అన్నారు.

పిల్లి నవ్వుతూ... పట్టలేని ఆనందంతో తబ్బి, ఉబ్బి ఎగురుతూ దోసకాయ చెంబులో తల దూర్చింది- పూర్తిగా దూర్చింది. గాలి తగలడం లేదు. తల తియ్యాలని విశ్వప్రయత్నం చేసింది ముసలి పిల్లి. తల రావడం లేదు... గాలి తగలడంలేదు.

"మహాప్రభూ చచ్చిపోయాను నాయనో" కేకలేసి గెంతడం మొదలెట్టింది పిల్లి. ఇత్తడి చెంబుని నేలకేసి "టంగ్‌టంగ్" మని బాదుతూ కాళ్లతో నెట్టింది. అయినా రావడంలేదు. "చెంబులో పిల్లి... పిల్లిలో చెంబు... పిల్లీ... చెంబూ" గాబరాగా అరిచారు బటులందరూ.

"రాజా గాబరా పడకండి! చెంబు నొకరు... నా కాళ్లనొకరు పట్టుకొని లాగండి సురక్షితంగా బయటపడతాను" కష్టంలోనూ కర్తవ్యం బోధించింది ముసలి పిల్లి.

"ఊ... వెళ్లండి" బటులను ఆదేశించారు రాజుగారు.

బటులు ఇరువైపులా పట్టుకొన్నారు.

"ఇన్ని తెలిసిన పిల్లికి ఈ విషయం తెలియకపోవడం విచారకరం" అన్నారు రాజుగారు... అందరూ విచారించారు.

"పట్రాపట్టో... హైసా" బటులు లాగారు.

"అమ్మో... నాయినో... అ...మో...నా" చచ్చిపోయింది ముసలి పిల్లి. చెంబులో రక్తం... బటుల చేతుల్లో రక్తం... నేలంతా రక్తం... రాజుగారు తలను రెండు చేతుల్తో పట్టుకొన్నారు- పెట్టెలా తగిలింది. ఎదురుగా చెంబుతో పిల్లి శవం. ●

# టీచర్ కావాలని కలగన్నాను...



ఎమ్.మలయశ్రీ

నేను పుట్టింది వరంగల్ సమీపంలోని వంగపహాడ్ అనే ఊరిలో. మా నాన్నగారు వరంగల్‌లోని ఆజంజాహిమిల్‌లో నాలుగవతరగతి కార్మికుడిగా పనిచేసేవారు. నా ప్రాథమికవిద్యాభ్యాసం వంగపహాడ్‌లో పూర్తయింది. డబుల్‌ప్రమోషన్‌తో 5వతరగతి పూర్తిచేసి హన్మకొండ లష్కర్ బజారులోని మస్కిమిడిల్ స్కూల్‌లో చేరాను. ఐదు, ఆరు తరగతుల్లోనే వచన రామాయణ,మహాభారతాలను చదివాను. వంగపహాడు స్కూల్లో మాకు కొమురయ్య అనే సారు ఉండేవాడు. ఆయన ఉర్దూలో రామాయణం వినిపించేవారు. వింటున్నకొద్దీ తన్మయం కలిగేది. మేము ఐదుగురం మిత్రులం హన్మకొండపాఠశాలకు రోజూ ఐదారు కిలోమీటర్లు నడిచివెళ్లేవాళ్ళం. మా గ్రూపులో ఒకతను నాయకుడిగా వుండేవాడు. అతను చెప్పినట్టు వినేవాళ్ళం. రోజూ బడి మానేసి సినిమాకు వెళ్ళాలన్నా మేం వెళ్ళాల్సిందే. ఈ సహవాసదోషం చదువుమీద పడింది. లెక్కలమీద మరీ ఎక్కువ. ఈ వెనుకబాటుదనం తర్వాతి జీవితంలో నన్ను బాగా దెబ్బతీసింది.

గోరుచుట్టుపై రోకటిపోటన్నట్టు 1960లో మా అమ్మగారు ధనుర్వాతం బారినపడ్డారు. సరైన వైద్యసౌకర్యం లభించక త్వరగానే చనిపోయారు. అదే సంవత్సరం

స్వగతం

అతి కష్టం మీద పైక్లాసు మేం ప్రమోట్ అయ్యాం. మా నాయకుడితో సహా ముగ్గురు ఫెయిలయ్యారు. ఆర్థిక ఇబ్బందులు, నా అనారోగ్యం వల్ల మా నాయనగారు ఒక సంవత్సరం చదువు మానిపించారు. తర్వాత మాకు దూరపు బంధువొకాయన లారీ డ్రైవర్‌గా పనిచేస్తుంటే, ఆయన వద్ద క్లీనర్‌గా పనిచేసేందుకు మానాన్న నన్ను తీసుకెళ్ళారు. "మరో రెండేళ్ళలో పిల్లవాడి మెట్రిక్ పూర్తవుతుంది. ఏదైనా ప్రభుత్వోద్యోగం వస్తుంది. ఇలాంటివాడిని నాతో క్లీనర్‌గా పంపిస్తావా?" అని మానాన్నమీద కోపగించి, మళ్ళీ బడికి పంపించమని సలహా ఇచ్చాడు. 1962లో మళ్లీ లష్కర్ బజారులోని ఉన్నతపాఠశాలలో చేరాను. హాస్టల్ సీటు దొరకలేదు. చాలా కష్టపడాల్సి వచ్చింది.

తల్లిలేని పిల్లల పరిస్థితి ఎలా ఉంటుందో, తల్లి ప్రేమకు నోచుకోక ఎలా విలవిల్లాడాల్సి ఉంటుందో అనుభవపూర్వకంగా తెలిసివచ్చింది. పాఠశాలకు చాలాసార్లు తిండి తినకుండానే వెళ్ళాల్సి వచ్చేది. చిన్నమ్మనో, స్నేహితులనో చిల్లరడబ్బులడిగి దొరికినప్పుడు హోటల్లో టిఫిన్ తిని వెళ్లేవాడిని. రోజూ కొన్ని కిలోమీటర్ల నడక. ఒక్కోసారి పరుగు. స్కూలు సెలవురోజుల్లో పొలాల్లో కలుపుతీయడానికి, నాట్లువేయడానికి కూలి పనికి వెళ్లేవాడిని. ఏ మాత్రం తీరిక దొరికినా పుస్తకం నా నేస్తం అయ్యేది. ప్రాచీన ఇతిహాసాల పట్ల అభిమానం. వాటిని చదవడంతో ప్రకృతిపట్ల ప్రేమపెరిగింది. అడవులను, వాటిలోని సహజ సుందరదృశ్యాలను, జంతువులను, అటవికులను చూడాలనే ఆకాంక్ష పెరిగింది. చేస్తే ఉపాధ్యాయవృత్తినే చేయాలి. అందులోనూ ములుగు, ఏటూర్‌నాగారం అడవి ప్రదేశాలందే పనిచేయాలనే బలమైన కాంక్ష, పట్టుదల ఉండేవి. 1965లో హెచ్.ఎస్.సి పరీక్షలో 60మంది ఇంగ్లండ్ హిస్టరీ ఆప్షనల్‌గా చదువుకుంటున్న విద్యార్థుల్లో నేను సెకండ్ క్లాసులో, మరో విద్యార్థి థర్డ్‌క్లాసులో పాసయ్యాం. మిగతావారందరూ ఫెయిలయ్యారు. అలా వేల జనాభాగల మాగ్రామంలో ఒకేసారి హెచ్ఎస్‌సి లో అదీ సెకండ్‌క్లాసులో పాసయిన మొదటి విద్యార్థిని నేనే అయ్యాను. కాలేజీలో చేరితే ఫీజు మాఫీ చేయించి, పుస్తకాలు ఉచితంగా ఇప్పిస్తానని మా క్లాసు టీచర్ వేంకటాచారిగారికి కృతజ్ఞతలు చెప్పగలిగానంతే. చిన్నచిన్న ఖర్చులకు కూడా ఇబ్బందిగా ఉండటంతో నా మనసులో చిరకాల కోరికను తీర్చుకోవడానికి టీచర్ ట్రయినింగ్‌లో చేరాలనుకున్నాను. రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తామని మా దూరపుబంధువులు మానాన్న మీద ఒత్తిడి తెచ్చారు. నాకు వేరే ఏ ఉద్యోగం చేయడానికి మనసొప్పక టీచర్ ట్రయినింగ్ ( బి.టి.ఎస్)లోచేరాలనే పట్టుపట్టాను. మానాన్న అంగీకరించలేదు. అవసరమయ్యే కొద్దిపాటి డబ్బు కూడా ఇవ్వలేనన్నాడు. మా అమ్మమ్మ తోడురాగా ఒక భూస్వామి భార్యను ఆశ్రయించి నా పరిస్థితి వివరించాను. అవసరమయిన డబ్బును అప్పుగా ఇమ్మని, స్టయిఫండ్ రాగానే వడ్డీతో సహా ఇచ్చేస్తానని పత్రం రాసి ఇచ్చాను. ట్రయినింగ్‌కు అప్లయ్ చేసుకోగా హన్మకొండ, నర్సంపేట బి.టి.ఎస్ లందు సీటు లభించినది. అటవీ ప్రాంతమగుటచే మక్కువతో నర్సం పేట బేసిక్ ట్రైనింగ్ స్కూల్‌లో చేరి 1965 - 67 మధ్య ట్రయినింగు పూర్తి చేశాను. చాలా కష్టపడ్డ తర్వాత, ఇంటర్వ్యూల తర్వాత ...ఓ ఇంటర్వ్యూలో 'నాకు కావల్సింది ఉద్యోగం, తాలూకాలోని ఏ మారుమూల గ్రామమైనా వెళతాను. పనిచేస్తాను' అని చెప్పాను. టీచర్‌గా పనిచేయాలన్న నా చిరకాలవాంఛ తీరింది.

రోడ్డు, పోస్టాఫీసులాంటి కనీస సౌకర్యాలు కూడా లేని బురదమయ గ్రామాల్లో పనిచేస్తూనే. క్రమక్రమంగా నా విద్యార్హతలు పెంచుకున్నాను. ఎమ్.ఏ.,వరకు చదువుకున్నాను. ప్రస్తుతం ఆదిలాబాద్ సమీపంలోని తోషం ఉన్నతపాఠశాలలో సీనియర్ తెలుగుపండిట్ పనిచేస్తున్న నా ఉపాధ్యాయ జీవితంలో మరవలేని, స్ఫూర్తిదాయకమైన ఘట్టాలు అనేకం ఉన్నాయి.